నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్-నిర్మల్

3 | నిజామాబాద్ గురువారం 15 ఆగస్టు 2024 | ADILABAD NIRMAL


# ఏర్పాట్ల పరిశీలన

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం



ఎదులాపురం, ఆగస్టు 14 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానం 78వ స్వాతంత్ర్య వేడుకలకు సిద్ధం అవుతున్నది. గురువారం నిర్వహించే జెండా ఆవిష్కరణకు పరేడ్ గ్రౌండ్‌ను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఉదయం 10 గంటలకు తెలంగాణ ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ వెల్ఫేర్ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ పతాకావిష్కరణ చేయనున్నారు. ఏర్పాట్లను కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలంతో కలిసి పర్యవేక్షించారు. సాంస్కృతిక, శకటాల ప్రదర్శన, అవార్డుల ప్రధానంపై చర్యలు తీసుకోవాలన్నారు.

# పెంపుడు కుక్కకు కేశఖండన

*నిర్మల్ జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖలో ఏఈగా పనిచేస్తున్న పాయం శంకర్ తన పెంపుడు కుక్క జో(4నెలలు)కు బుధవారం టీఎన్జీఎస్ భవనంలో కేశఖండన ఉత్సవం నిర్వహించారు. శంకర్ తండ్రి చిలుకయ్యతో కలిసి జోను తన కుమారుడిలాగా భావిస్తూ పెంచుకుంటూ అన్ని కార్యక్రమాలు నిర్వహించారు. శంకర్ భార్య లక్ష్మి 12 ఏళ్ల క్రితం మృతి చెందాడు. మనిషిలాగే శునకానికి అన్ని కార్యక్రమాలు నిర్వహించడం విశేషం.*

*- నిర్మల్ చైన్‌గేట్, ఆగస్టు 14*



పెంపుడు కుక్క జో



తెలంగాణ చౌక్‌లో నిరసన తెలుపుతున్న వామ పక్షపార్టీల నాయకులు

# కార్మిక వ్యతిరేకి బీజేపీ

ఎదులాపురం, ఆగస్టు 13 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదని, బీజేపీ ప్రభుత్వం నుంచి దేశాన్ని కాపాడుకుందామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దత్తాత్రిలు మండిపడ్డారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రం నిత్యం స్వదేశీ జపం చేస్తూ విదేశీ సంస్థలకు భారత దేశాన్ని తాకట్టు పెట్టి, జాతీయ వనరులు, సంపదను లూటీ చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, ఉపాధ్యక్షుడు అగ్గిమల స్వామి, నాయకులు పండుగ పొచ్చన్న, ఐఎన్‌టీయుసీ జిల్లా అధ్యక్షుడు మునిగాల నర్సింగ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి చిర్రె దేవేందర్, ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి చిలక దేవిదాస్, ఏఐటీయూసీ నాయకుడు రాజు, ఆశన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి వెంకట్ నారాయణ, జిల్లా నాయకుడు మాధవి గణేశ్, టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్ సింగ్, జిల్లా సహాయ కార్యదర్శి ఉమ్రే నితిన్, ఏఐపీకేఎస్ జిల్లా అధ్యక్షుడు కొడప సురేశ్, జిల్లా నాయకుడు బుచ్చి రామ్ పాల్గొన్నారు.



మావలలో పంటల వివరాల నమోదును పరిశీలిస్తున్న డీఏవో పుల్లయ్య

# సాగు సర్వే

**ఆన్‌లైన్‌లో పంటల వివరాలను నమోదు చేస్తున్న సిబ్బంది**

- **క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు**
- **పంట ఉత్పత్తులు, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడానికి మేలు**

ఆదిలాబాద్, ఆగస్టు 14(నమస్తే తెలంగాణ) : వానకాలం సాగు వివరాలను వ్యవసాయశాఖ అధికారులు ఆన్‌లైన్ చేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 101 వ్యవసాయ క్లస్టర్ల పరిధిలో వివరాలను సేకరిస్తున్నారు. జూలైలో ప్రారంభమైన సర్వేను పూర్తిస్థాయిలో నిర్వహించడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. సర్వేలో భాగంగా రైతు పేరు, ఎన్ని ఎకరాల భూమి ఉంది, ఎంత విస్తీర్ణంలో ఏఏ పంటలు సాగవుతున్నాయి, సర్వే నంబరు, ఫోన్ నంబరు, ఇతర వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారులు నమోదు చేసుకుంటున్నారు. వానకాలంలో పత్తి, సోయాబీన్, కంది పంటలను రైతులు అధికంగా సాగు చేస్తారు. పంటలకు వాతావరణంతోపాటు వర్షాలు అనుకూలిస్తుండడంతో పత్తి 60 రోజులు, మిగతా పంటలు 50 రోజుల కాల వ్యవధిలో ఉన్నాయి. నమోదు వివరాలను కలెక్టర్ రాజర్షి షా, జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య, ఏడీలు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలిస్తున్నారు. పకడ్బందీగా సర్వే నిర్వహించాలని సిబ్బందికి సూచనలు చేస్తున్నారు.

## పలు ఉపయోగాలు

సాగు వివరాల సేకరణ రైతులతోపాటు వివిధ శాఖల ప్రభుత్వ అధికారులకు ఉపయోగపడుతుంది. పంట ఉత్పత్తుల విక్రయాలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తుండడంతో రైతులు తమ పంటలను మార్కెట్‌యార్డుల్లో మద్దతు ధరకు విక్రయించుకునే అవకాశం ఉంది. అధికారులు దిగుబడులను అంచనా వేయవచ్చు. దీని ఆధారంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయవచ్చు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలు నష్టపోతే పరిహారం అందజేయడానికి ఉపయోగపడుతాయి. రైతులు తమ పంటల వివరాలను వ్యవసాయ సిబ్బందికి తెలియజేయాలని అధికారులు సూచిస్తున్నారు.

# దుబాయ్‌లో గొసంపల్లె వాసి మృతి



పుల్కం రాజేశ్వర్(ఫైల్)

ఖానాపూర్ రూరల్, ఆగస్టు 14 : మండలంలోని గొసంపల్లె గ్రామానికి చెందిన పుల్కం రాజేశ్వర్(42) దుబాయ్‌లో బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పదిహేను ఏండ్లుగా ఉపాధి కోసం దుబాయ్‌కి వెళ్లి తమ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 1వ తేదీన తమ క్యాంపు కార్యాలయంలో బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో తోటి వారు దుబాయ్‌లోని దవాఖానలో అడ్మిట్ చేశారు. ఎనిమిది రోజులుగా చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందాడని వైద్యులు తెలిపారు. కాగా మృతదేహం బుధవారం స్వగ్రామానికి చేరుకోగా కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

# కుక్క దాడిలో ఎనిమిది మందికి గాయాలు



చిన్నారికి అయిన గాయం

ఇచ్చోడ(సిరికొండ), ఆగస్టు 14 : ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండల కేంద్రంలోని కొత్తవాడ, గాంధీచౌక్, బోయవాడ, హనుమాన్ గల్లీలో కుక్కలు తిరుగుతూ ఎనిమిది మందిని గాయపర్చాయి. అందులో మహిళలు అనసూయ, సావిత్రిబాయి, చంద్రకళ, భీంబాయి, ఇద్దరు చిన్నారులు అశు, చిక్రం బండుపై దాడి చేశాయి. అలాగే కొం డాపూర్ నుంచి వచ్చిన ఇద్దరిపై గాంధీచౌక్‌లో దాడి చేసి గాయపర్చాయి. స్థానికులు క్షతగాత్రులను ప్రభుత్వ దవాఖానకు తరలించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న దేవసేన

# ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి

బాసర, ఆగస్టు 14 : ఆత్మస్థైర్యంతో ప్రతి విద్యార్థి ముందుకెళ్లాలని పాఠశాలల విద్య, కాలేజీ టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ దేవసేన పేర్కొన్నారు. బుధవారం ట్రిపుల్ ఐటీలో నిర్వహించిన ఓరియంటేషన్ ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా ఆర్జీయూకేటీలో సీట్లు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఆర్జీయూకేటీలో 70 శాతం బాలికలు ఉండడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ వీసీ వెంకటరమణ, అసోసియేట్ డీన్స్ పావని, చంద్రశేఖర్, మహేశ్, కార్యక్రమ కోఆర్డినేటర్ శ్రీనివాస్, పవన్ పాల్గొన్నారు.



రూరల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్క నాటి నీరు పోస్తున్న ఎస్పీ గౌష్ ఆలం

## అసాంఘిక కార్యకలాపాలను రూపుమాపాలి

### ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, ఆగస్టు 14 : అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపాలని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. బుధవారం సాయంత్రం ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పతి ఒక్కరు 24 గంటలు అప్రమత్తంగా ఉంటూ విధులను నిర్వర్తించాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. అదేవిధంగా రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వచ్చే లాండసాంగ్వి గ్రామంలోని బ్రిడ్జిని, నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ కె.ఫణిందర్, ఎస్సై ముజాహిద్, సిబ్బంది పాల్గొన్నారు.



నిర్మల్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ప్రజలు

# ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని నిలిపేయాలి

**నిర్మల్ కలెక్టర్ కార్యాలయం ఎదుట గ్రామస్తుల నిరసన**

నిర్మల్ అర్బన్, ఆగస్టు 14 : ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరుతూ బుధవారం దిలావర్‌పూర్ మండలానికి చెందిన గ్రామస్తులు కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఫ్యాక్టరీ నిర్మాణంతో ఇబ్బందులు తలెత్తుతాయని మండిపడ్డారు. వెంటనే నిర్మాణాన్ని నిలిపి వేయాలని డిమాండ్ చేశారు.

## కలెక్టర్‌కు వినతి

ఇథనాల్ ఫ్యాక్టరీతో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో దిలావర్‌పూర్, గండంపల్లి గ్రామస్తులు ఫ్యాక్టరీ నిలిపివేయాలని కోరుతూ కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇథనాల్ ఫ్యాక్టరీ వల్ల ప్రజలకు ఇబ్బందులు కలిగించే పనులను ప్రోత్సహించబోమని తెలిపారు. ఫ్యాక్టరీ నిర్మాణ ప్రదేశంలో ఆర్డీవో, తహసీల్దార్ బృందం దర్యాప్తు జరిపి నివేదికను సమర్పించాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటామని అన్నారు.

## 22 మందిపై కేసు

దిలావర్‌పూర్, ఆగస్టు 14 : 30 పోలీస్ యాక్ట్(నిబంధన) అమలులో ఉన్నందున గుంపులు, గుంపులుగా రోడ్డుపై నుంచి ర్యాలీగా వెళ్లిన దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన 22 మందిపై బుధవారం కేసులు నమోదు చేసినట్లు దిలావర్‌పూర్ ఎస్ఐ రాజేశ్వర్‌గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఇథనాల్ పరిశ్రమ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించి, ప్రజల శాంతికి భంగం కలిగించిన 22 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



మిషన్ భగీరథ ట్యాంక్ వద్ద ఇంకుడు గుంత ఏర్పాటు చేయాలని ఆదేశిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

# పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

**ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా**

ఎదులాపురం, ఆగస్టు 14 : పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ రాజర్షి షా హెచ్చరించారు. బుధవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ఖండాల అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ గిరిజన శాటిలైట్ సెంటర్(పోతగూడ)లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిషన్ భగీరథ ట్యాంక్ వద్ద ప్లాట్ ఫాం, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని, ట్యాంక్ చుట్టూ పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, మెనూ ప్రకారం ఏ రోజుకారోజు అందించాల్సిన ఆహారాన్ని అందిస్తున్నారా అని పరిశీలించారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించారు. వంటగది, స్టోర్ రూంలోని సరుకులు, టాయిలెట్స్ పరిశుభ్రంగా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సూర్యకాంత్ పాల్గొన్నారు.

# సబ్సిడీ గ్యాస్ అంటూ అకౌంట్లు ఓపెన్

ఎదులాపురం, ఆగస్టు 14 : ప్రభుత్వ పథకాల సబ్సిడీ కోసం తమ బ్యాంకు ఖాతాలే అవసరమని జిల్లాకేంద్రలోని బస్టాండ్ సమీపంలోని ఓ బ్యాంకు సిబ్బంది కొందరి వద్ద ఖాతాలు తెరిపించారు. ఇందుకోసం ఒక్కొక్కరి వద్ద రూ.100 చొప్పున వసూలు చేశారు. వాడల్లో తిరుగుతూ వందలాది ఖాతాలు తెరిచినట్లు తెలుస్తున్నది. అయితే ప్రభుత్వ పథకాల సబ్సిడీలకు లబ్ధిదారులకు ఇప్పటికే ఉన్న బ్యాంకు ఖాతాలే వర్తిస్తాయన్న విషయం తెలిసిందే . ఆదిలాబాద్ పట్టణంలోని రాంగనర్ కాలనీలో సుమారుగా 50 వరకు అకౌంట్లు ఓపెన్ చేసినట్లు సమాచారం. ఖతాలు తెరిపిస్తుండగా.. కాలనీవాసులు నిలదీయటంతో అక్కడి నుంచి వారు వెళ్లిపోయారు. అధికారులు ఇప్పటికైనా వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



బ్యాంకు సిబ్బందిని నిలదీస్తున్న కాలనీవాసులు

# విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం



భైంసా-బాసర రహదారిపై రాస్తారోకో చేస్తున్న పిప్రి గ్రామస్తులు

- **కరెంటు షాక్‌తో యువకుడి మృత్యువాత**
- **భైంసా-బాసర రహదారిపై కుటుంబ సభ్యుల రాస్తారోకో**

ముథోల్, ఆగస్టు 14 : విద్యుత్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో విద్యుత్ షాక్ తగిలి యువకుడు మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకున్నది. వివరాలిలా ఉన్నాయి. పిప్రి గ్రామానికి చెందిన షేక్ మక్దూమ్(45) ఇంటికి కొన్ని రోజులుగా విద్యుత్ సరఫరా సక్రమంగా కాకపోవడంతో లైన్‌మన్ జగదీశ్‌కు పలుమార్లు ఫోన్ చేశాడు. స్పందించక పోవడంతో కర్రతో తీగలను సరిచేస్తుండడంతో షాక్‌కు గురై మంగళవారం రాత్రి 7.30 గంటల ప్రాంతంలో మృతిచెందాడు. మృతికి నిరసనగా బుధవారం గ్రామస్తులు బాసర-భైంసా రహదారిపై పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. విద్యుత్ అధికారులు రావాలని నినాదాలు చేశారు. సీఐ మల్లేశ్, తహసీల్దార్ శ్రీకాంత్‌లు వచ్చి విద్యుత్ అధికారులతో మాట్లాడుతామని చెప్పడంతో ధర్నాను విరమించారు. భైంసా విద్యుత్ శాఖ డీఈ రవీందర్‌రెడ్డి గ్రామంలో పర్యటించి విద్యుత్ లైన్‌ను పరిశీలించారు. బాధితుని కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలని డీఈని కోరగా రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. అలాగే లైన్‌మన్‌పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో సమస్య సద్దుమణిగింది. రాస్తారోకో వద్ద ముథోల్ ఎస్సై సాయికుమార్, ఏఎస్సై గంగాధర్ ఉన్నారు.



# విధుల బహిష్కరణ

రిమ్స్ డైరెక్టర్ చాంబర్ ఎదుట నిరసన తెలుపుతున్న జూడాలు

*మెడికల్ కళాశాలల్లో సరైన రక్షణ లేని కారణంగా వైద్యులపై దాడులు జరుగుతున్నాయని రిమ్స్ జూడాల అధ్యక్షుడు సందీప్‌చారి అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్య కేసుల్లో నిందితులను పట్టుకోవాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జూడాలు విధులు బహిష్కరించి బుధవారం రిమ్స్ డైరెక్టర్ చాంబర్ ఎదుట నిరసన తెలిపారు. ప్రాణాలు కాపాడే వారికి సరైన రక్షణ లేకుండా పోయిందని ఆవేదన చెందారు. జూడాలు కారుణ్య, అన్వేశ్, మౌనిక, సూరజ్, రాజు పాల్గొన్నారు.*

*- ఎదులాపురం, ఆగస్టు 14*





